**ఎస్. మునిసుందరం**

ఇందులో—
లక్ష్మీపతి
శ్రీపతి
రాజా
కాంతారావు
కొండలు
రాధ

[ప్రేక్షకులను విసిగిస్తున్న తెర తొలగింది. అంతా చీకటి. ఒక స్పాట్ ద్వారా కాంతి టీపాయ్ మీద పడింది. అక్కడ రెండు బూట్లు కదులుతున్నాయి. ఆశ్చర్యంగా కాంతి ముందుకు సాగింది. ఒక యువకుడు ఏదో ఆలోచిస్తూ సోఫాలో కూర్చుని ఉన్నాడు. అతని ఎదురుగా టీపాయ్ మీద బ్రాందీ బాటిల్, పిస్టల్ ఉన్నాయి. ఇదంతా చూపిన కాంతి రంగమంతా వ్యాపించింది. అది లక్ష్మీపతి మేడలో హాలు. ఆయన హోదా, దర్పం హాలులో కూడా కనిపిస్తున్నాయి. మేడపైకి మెట్లు మధ్యలో ఉన్నాయి. అటూ, ఇటూ మూడు నాలుగు ద్వారాలున్నాయి. ఎడమవైపు ద్వారం వీధిలోకి పోతుంది.

యువకుడు లేచాడు. హాలును చూపిన కాంతి భయంతో చిన్నదై ముడుచుకుపోయింది. యువకునితో బాటు లేచింది. యువకుడు పిస్టలు తీసుకొన్నాడు. అటూ ఇటూ పచార్లు చేశాడు. ఏం చెయ్యాలో తోచలేదు. "నో నో" అంటూ బయటకు వెళ్ళాడు. కొండలు వచ్చాడు. బాటిల్ చూశాడు. దానిని దాచి దాని స్థానంలో ఇంకోటి తెచ్చి పెట్టాడు. కుర్చీలు తుడుస్తున్నాడు. యువకుడు తిరిగి వచ్చాడు. చేతిలో పిస్టలు లేదు. బ్రాందీ బాటిల్ని చూస్తున్నాడు. ఏదో నిర్ణయానికి వచ్చాడు. "ఇదే, ఇదే" అంటూ బాటిల్ ఎత్తుకొన్నాడు. బిరడా తీసి నోట్లో పోసుకొన్నాడు. అందులో ఏమీ లేదు. అతని పేరు కాంతారావు.]

కాంతారావు : (నవ్వుతాడు.) అంతా సినిమాటిక్‌గా ఉందే! కొండలూ!

కొండలు : ఇక్కడే ఉన్నాను, బాబూ!

కాంతారావు : ఉన్నావా, తండ్రీ! అయితే, సరే. ఈ బాటిల్ ...

కొండలు : దాచేస్తాను, బాబూ! (బాటిల్ తీసుకొని లోపలి కెళతాడు. దిక్కుతోచక చూస్తున్న కాంతారావు కొంతసేపటికి తేరుకొన్నాడు.)

కాంతారావు : కొండలూ! (గట్టిగానే పిలిచాడు.)

కొండలు : (వచ్చాడు.) గది తుడవమన్నారు, బాబూ! మీరు కాస్త బయటికి వెళితే ...

కాంతారావు : (కోపం వస్తుంది కాని, ఆపుకొన్నాడు.) వెళతాను, వెళతాను. వెళ్ళే లోపల అందర్నీ ... మిమ్మల్నందర్నీ ... (బయటకు వెళతాడు. కొండలు నవ్వాడు. కొండలంటే ముసలి నౌకరు. పగలు చూస్తే రాత్రి కలలోకి వస్తాడు. గూని, బవిరి గడ్డం, ముడతల మొహం —బాగా వంగి ఉంటాడు.)

కొండలు : కవిత్వం రాసుకో, బాబూ! సల్లంగా దినాలు గడిచిపోతాయి. నాగుబామును రెచ్చగొడితే పచ్చపోయేది మీరే. నా గతేమయ్యింది! కాని, నేను దెబ్బకు దెబ్బ తీస్తాను. పెళ్ళి ఎట్టా చేస్తాడో చూస్తాను. (ఆవేశంగా రేడియోను తుడుస్తున్న అతని దృష్టి గోడకున్న తుపాకీ మీద పడింది. తీశాడు. తుడిచాడు. గురిపెట్టాడు. అనుకోకుండా ఆ గురి గోడమీదున్న లక్ష్మీపతి ఫోటోపై ఉంది. క్రూరంగా చూశాడు. ఏదో శబ్దం వినిపించింది. కొండలు కంగారుగా తుపాకీతో సహా మధ్య ద్వారం గుండా లోపలికి వెళ్ళాడు. నిశ్శబ్దం. క్షణం తర్వాత కోటు గుండీలు వేసుకొంటూ లక్ష్మీపతి మరో ద్వారం నుండి హాల్లోకి వచ్చాడు. చిటికలో హాలుని కొలిచింది అతని దృష్టి.)

లక్ష్మీపతి : కొండలూ! కొండలూ! (కొండలు పలకడు. అరిచాడు.) కొండలూ!
(కొండలు తుపాకీ గురి పెట్టుకొనే ఒక్క ఉరుకులో వచ్చాడు.)

కొండలు : తప్పించుకోలేవు ... తప్పించుకోలేవు!

లక్ష్మీపతి : (భయం, కోపం) కొండలూ!

కొండలు : (చూశాడు, నవ్వేశాడు. కాని, భయంకరంగా ఉంది ఆ నవ్వు) మీరా, బాబూ!

లక్ష్మీపతి : ముందా తుపాకీ దించు. (కొండలు పొరపాటయినట్టు దించాడు.) వెళ్ళు.

కొండలు : మీరు పిలిచారు.

లక్ష్మీపతి : తుపాకీ ఎందుకు తీశావు? (వెళ్ళే కొండలు ఆగాడు.)

కొండలు : కాఫీ తీసుకు రమ్మంటారా!

లక్ష్మీపతి : అడిగినదానికి సమాధానం చెప్పు.

కొండలు : పనిలేకుండా ఈ గోడ మీద నిద్రపోతుంటే...

లక్ష్మీపతి : నిద్రలేపి వాకే పసరు పెడతా మనుకొన్నావా!

కొండలు : లేదు, బాబూ! అంత పుణ్యమా నాకు? కాని, మీలో నిద్రపోతున్న ... రాఘ ...

లక్ష్మీపతి : (కోపం) నోర్మూయ్. (క్రూరంగా చూస్తూ కొండలు వైపు వెళ్ళాడు. కొండలు వణికిపోయాడు.) నో నో. వెళ్ళు ... వెళ్ళు. పాసపాము! (కొండలు లోపలికి వెళ్ళాడు. మళ్ళీ మామూలు స్థితిలోనికి రావడానికి కొంత శ్రమ పట్టింది. లక్ష్మీపతి కూర్చున్నాడు. సిగరెట్టు అంటించాడు.) రాధా! రాధా!
(వీథిలోనుండి కాంతారావు వచ్చాడు.)

కాంతారావు : రాధ కాలేజీకి వెళ్ళింది, మామయ్యా!

లక్ష్మీపతి : అవునుగదూ? ఆఁ కాంతం! ఈ వేళ తారీ కెంత?

కాంతారావు : నేను కవిని, మామయ్యా!

లక్ష్మీపతి : అయితే?

కాంతారావు : కవుల దృష్టి కాలెండర్ల మీద ఉండదు.

లక్ష్మీపతి : మరెక్కడుంటుందోయ్!

కాంతారావు : వాళ్ళు కాలాతీత వ్యక్తులు. కాలం వాళ్ళని బంధించలేదు.

లక్ష్మీపతి : ఒరేయ్, కాంతం, నీ బుర్ర ఉంది చూశావూ...?

కాంతారావు : చూడలేదు, మామయ్యా!

లక్ష్మీపతి : అంత టయాం నీ కెక్కడేడ్చిందిలే? ఇన్‌స్యూర్ చెయ్యచ్చురా.

కాంతారావు : అవును, మామయ్యా!

లక్ష్మీపతి : ఏమిట్రా అవును?

కాంతారావు : లక్ష రూపాయలకు చెయ్యి, మామయ్యా!

లక్ష్మీపతి : ఏం, కావాలా లక్ష?

కాంతారావు : ఇచ్చెయ్యి, మామయ్యా! బుల్‌డోజర్‌తో ఈ ఊరును చదును చేసేస్తాను.

లక్ష్మీపతి : ఏడిశావులే. నోరుమూసుకో. ఒకవేళ ఈ రోజు వస్తాడేమో?

కాంతారావు : నే నుండగానే ఏమిటి, మామయ్యా, ఆ స్వగతం?

లక్ష్మీపతి : నీ కనవసరం. (చర చరా బయటికి వెళ్ళాడు.)

కాంతారావు : అవునులే. ఒక రోజు నా అవసరం కూడా కలుగుతుందిలే.
(సోఫాలో కూర్చున్నాడు. వ్రాయటం ప్రారంభించాడు. పుస్తకాలతో రాధ వచ్చింది.)

రాధ : హల్లో, బావా!

కాంతారావు : (వ్రాస్తూనే) యా!

రాధ : ఏం బావా, కోపమొచ్చిందా?

కాంతారావు : (సీరియస్‌గా చూచి) కాలేజీనుంచేనా?

రాధ : కాదు. కళాశాల నుండియే!

కాంతారావు : తెలుగు కూడా వస్తుందన్నమాట.

రాధ : చదువుతున్నది తెలుగులోనే కదా?

కాంతారావు : అంత భాషాభిమానం తెలుగువాడి కెక్కడేడ్చిందిలే. రాధా! మనం ఇప్పుడు మంచి మూడ్‌లో ఉన్నాం.

రాధ : అయితే, మనం నిష్క్రమిస్తాం. లేకుంటే ఏం ప్రమాదం వస్తుందో!

కాంతారావు : వెళ్ళకూడదు. ఇప్పుడే వ్రాశాం, ఒక చిన్న ప్రేమగీతం. విని మరీ వెళ్ళమని మా కోరిక.

రాధ : (ఏడ్పు మొహంతో) బా...వా...!

కాంతారావు : రాధా! ఏమయింది?


రాధ : ఇప్పుడా కవిత్వం వింటే నా కళ్ళు తిరిగేలా ఉన్నాయి. అందుకని ఓ కప్పు కాఫీ సేవించి ...

కాంతారావు : నైస్ ఐడియా. ఒరేయ్ ... కొండ ...

రాధ : వద్దు. నేనే వెళ్ళి, సొంత చేతులతో ...

కాంతారావు : సరే, వెళ్ళిరా.
(ప్రమాదం తప్పించుకొన్నట్లు వెళ్ళిపోయింది.)

కాంతారావు : (నిరాశగా) రోజు లిట్టా తగలడ్డాయి. కవిత్వం వ్రాశాను, వినండి మొర్రో అంటే వినే నాథుడేడి? మూడ్ అంతా పోయింది. మూడ్ కోసం మళ్ళీ ఓ రౌండు కొట్టి రావాలి. (బయటకు వెళ్ళాడు.)
(టవల్‌తో మొహం తుడుచుకొంటూ వచ్చింది రాధ. వెనకాలే కొండలు వచ్చాడు. రేడియో దగ్గరి కెళ్ళింది. జాకెట్టు నుండి ఒక కాగితం తీసి చదువుకొన్నది. ముఖంలో ఆనందం. రేడియో స్విచ్ వేసింది. ఏదో పాట. పాట వినే ధ్యాసలో ఆ కాగితం అక్కడ పెట్టింది. ఇదంతా గమనిస్తాడు కొండలు.)




రాధ : కొండలూ!

కొండలు : ఇక్కడే ఉన్నానమ్మా.

రాధ : నాన్నగా రెక్కడి కెళ్ళారు?

కొండలు : నాకేం తెలుసు? పోయేవాళ్ళెవరూ చెప్పి పోలేదింకా ...

రాధ : ఏమిటా వెధవ కూతలు? జాగ్రత్తగా మాట్లాడు. వెళ్ళు. కాఫీ తీసుకురా! ( కోపంగా వెళ్ళాడు. రాధ మేడ మీదికి వెళ్ళబోయింది. ఎవరో వచ్చిన చప్పుడయింది. )

రాధ : ఎవరు?


వ్యక్తి : ఈ ఇల్లు లక్ష్మీపతిగారి దనుకుంటాను. రైలు దిగ్గానే కాళ్ళు సరాసరి ఇక్కడికే వచ్చి ఆగి పోయాయి. సందేహం లేదు. తప్పక ఇదే అయి ఉండాలి. ఏమంటారు? !

రాధ : ( సందేహం ) మీరు ... ( సూట్‌కేస్ బల్ల మీద పెట్టాడతను. మెల్లిగా మెట్లు దిగిందామె. )

వ్యక్తి : మీ పేరు రాధ గదూ ... పేరులోనే ఎంత బాధ! మరి మీ గాథ! ...

రాధ : నాన్సెన్స్!

వ్యక్తి : కోపం మీ కళ్ళకు అందాన్నివ్వడం లేదు.



RB/BB/TL/16

రాధ : ఎవరు మీరు?

వ్యక్తి : సారీ! మీ మనసు నొప్పించాను గదూ?

రాధ : ఎందుకొచ్చారు?

వ్యక్తి : మాట్లాడనివ్వండి నన్ను. ( రాధను క్రింది నుండి పైకి చూచి ) మిమ్మల్ని చూస్తుంటే అజంతా శిల్పాలు గుర్తుకొస్తున్నాయి. అఫ్ కోర్స్, వాటికి ప్రాణం లేదనుకోండి.

రాధ : ( మాట్లాడదు. )

వ్యక్తి : ఇంకా చెప్పమన్నారా! ఇంత క్రితమే తిన్న అయ్యర్ హోటల్ ఐస్ క్రీమ్ గుర్తుకొస్తుంది.

రాధ : ఛీ!

వ్యక్తి : అదేమిటి? చనువు తీసుకుంటున్నాను కదూ? అది నా అలవాటు ... అందులోనూ ఆడపిల్లల దగ్గర...

రాధ : మీ రిక్కడి నుండి...

వ్యక్తి : వెంటనే పోవాలంటారు! కాని, నేను ఉండడానికి వచ్చాను. ఓహ్! పైగా అంతస్తు ఉండదన్నమాట. ఇంకేం? హాయిగా ఉంటుంది. అనువుగా కూడా ఉంటుంది. అదేమిటి, అట్లా చూస్తున్నారు? అవును మరి. ఇంటికి వచ్చిన అతిథిని వాకిట్లో నిలబెట్టి పలకరిస్తే —

రాధ : మీరూ ...

వ్యక్తి : మీ మాటలు వింతగా ఉన్నా యంటారు. అంతేలే. నేను ఎక్కడికి వెళ్ళినా ఈ సర్టిఫికెట్ మాత్రం లభిస్తుంది. నేను కాలేజీలో ఉన్నప్పుడు, దీపాల్లాగే ఒక అమ్మాయి అనింది మాట.

రాధ : హౌ డేర్! మీ పేరు?

వ్యక్తి : తలనొప్పి. అంటిపెట్టుకొనే జబ్బు. పేరడిగారు గదూ? నా అనేవాళ్ళు 'బాబీ' అంటారు. ప్రపంచం 'రాజా' అంటుంది. మీ కిష్టమయిన పేరుతో మీరు పిలవండి. 'బీస్ట్' అనండి, 'ఘోస్ట్' అనండి, మరేమయినా అనండి, పలుకుతాను. నాకు ఈ పేర్లమీద నమ్మకం లేదు. మొన్న రాత్రి బెజవాడలో ఒక తమాషా జరిగింది. నేను దిగిన హోటల్లో రంగురంగుల సీతాకోక చిలుకలు—నిన్నో చెప్ప లేను. ఒక చిలుకను పేరడిగితే ముసిముసి నవ్వులు విసిరిందే గాని, జవాబుమాత్రం చెప్ప లేదు. పేరడిగితే 'సావిత్రి' అంది. తరవాత ఆమె చేసే వ్యాపారం తెలిసి ఎవరు ఆ పేరు పెట్టారా అని బాధపడ్డాను.

రాధ : అయ్యో, పాపం! ( వ్యంగ్యంగా. )

వ్యక్తి : ఏం, అంత జాలిగా అన్నారు?

రాధ : మీ అవస్థ చూచి.

రాజా : మీరేం దిగులుపడకండి. కొత్త వాతావరణంలో నేను చాలా సులువుగా కలిసిపోగలను.

రాధ : మిమ్మల్ని చూడగానే అనుకొన్నాను. కూర్చోండి. నాన్నగారు వస్తారు. ( వీళ్ళిద్దరి సంభాషణ మధ్యలోనే కొండలు వచ్చాడు కాఫీతో. రేడియో దగ్గరున్న కాగితం తీసుకొని నీలం రంగు కాగితం అక్కడ పెట్టాడు. ఏదో పని చేసు కొంటున్నాడు హాల్లోనే. )

రాజా : అంటే నేను వెడతానని చెబుతున్నారా? ఎలాగూ వెడుతున్నారు గదా — నా ప్రశ్నకు సమాధానం చెబుతారా?

రాధ : అడగండి.

రాజా : అడగమంటారు గాని, ఆ తరవాత అగ్ని పర్వతంలా విరుచుకు పడతారుగా?

రాధ : అంత అర్భకులా?

రాజా : కాదనుకోండి. ( ఆమె నొక్కసారి చూచి ఉషస్సులా వెలుగుతున్న ఈ ఊర్వశికి కాను వరుడెవ్వరో ...

రాధ : ఛీ! ( సిగ్గు, కోపం. )

రాజా : అదేమిటి అంతమాట న్నారు?

రాధ : మీరు ... మీరు ... ( నవ్వి ఇంట్లో తుర్రుమంది. )

రాజా : నేనేం తప్పు అడిగానా? ఆడపిల్లలంతా ఇంతే. నా కందుకే చిరాకు. ఆ చిన్ని హృదయాల్లో లెక్కలేనన్ని ఊహలు. సూటిగా వేసే ప్రశ్నకు సమాధానం చెప్పడం మాని ఎందుకు తుర్రు మంటారో తెలని ప్రశ్న. ( ఇటు తిరిగాడు. )

కొండలు : ఇన్నాళ్ళకు వచ్చావన్న మాట!

రాజా : ఏమిటి ను వ్వనేది? ను వ్వెవరు?

కొండలు : నాకు తెలుసు, సమయం వచ్చింది. అందుకే వచ్చావు.

రాజా : గట్టివాడిలా ఉన్నావు.

కొండలు : నా జీవితం న న్నట్లా చేసింది. పాపం ఎన్నాళ్ళు రాజ్యం చేస్తుంది? ఆ రోజు వచ్చేసింది.

రాజా : ఏదయినా రహస్యమా?

కొండలు : రహస్యాల్లెని బ్రతుకులు మావి కొలకొని నా చూపగలవా భూమిమీద! ( రాజా షాక్ తిన్నాడు. కొండలు నవ్వాడు. ) ఆ రాత్రి ... ఆ రాత్రి ... ( ఆవేశంతో ) ఈ రెండు చేతులతో ... ( వెళ్ళబోయాడు. )

రాజా : ఊఁ?

కొండలు : నువ్వు కుర్రాడివి. జాగర్త. ఇది పులి బోను. నా పేరు కొండలు. ( వెళ్ళాడు ఎవ్వ. బి. లోకి. రాజా కర్దం కాలేదు! పచార్లు చేస్తూ రేడియో దగ్గరి కొచ్చాడు. రంగు కాగితం కనిపించింది. తీసి చూశాడు. చదవాలా, వద్దా అన్న భావం. ఒక నిమిషం. పైకే చదివాడు. ) రాత్రి ... ఒంటి గంటకు ... లక్ష్మీపతి ... రాధ ... ( మళ్ళీ చదవ లేదు మడిచి జేబులో పెట్టుకొన్నాడు. ఏదో ఆలోచిస్తూ ఒక మూలకు వచ్చాడు. రాధ వచ్చింది. మేజాపై ఏదో వెతుకు తూంది. రాజా చూశాడు. )

రాజా : మీరేం వెతుకుతున్నారో నాకు తెలుసు. పారేసు కొన్న హృదయం టేబిల్ మీద ఉంటుందా?

రాధ : ( కంగారుగా ) ఆఁ!

రాజా : కంగారెందుకు? విలువైన వస్తువు కాకుంటే మీరు మళ్ళీ వెంటనే వస్తారా? ఆమాత్రం ఊహించలేనా?

రాధ : థాంక్స్. ( వెళ్ళింది ఇంట్లోకి. రాజాకు ఏం తోచదు. జేబులో చెయ్యి వేసి తీశాడు. పిస్టల్ వచ్చింది. చిన్నగా నవ్వాడు. )

రాజా : ఆహారం లేక తుప్పుపట్టిన ఆయుధం పోర్ట్ ఫోలియో లేని మంత్రిలా ఉంది. పిట్టలు కూడా భయపడడం లేదు.

( బయట నుండి ఎవరో పరుగెడుతూ వస్తు న్నట్టు శబ్దం. పిస్టల్ జేబులో వేశాడు.

ఎక్కుతూ తప్పుకొన్నాడు. ఆ వచ్చే మనిషి దూకుడుగానే వచ్చాడు. ఏదో ఫైల్‌లాంటిది టేబిల్ మీదికి విసిరాడు. రాజాను గమనించ లేదు. రాజా అతన్ని గమనిస్తున్నాడు. ఆ వచ్చిన వాడు కాంతారావు. )

కాంతారావు : ( విసుగు, కోపం ) కవు లన్నారంటే ఒకరికే ఉన్నారా? డబ్బు, డబ్బు. క్షణం శాంతి లేదు వర్రీ డబ్బు రాత్రి. కక్కుర్తి. ఎందుకో ఇదంతా! పోయేటప్పుడు కట్టుకు పోతారేమో? ఏదీ, ఒక్క క్షణం, కేవలం ఒక్క క్షణం. ప్రశాంత వాతావరణం. ఎక్కడ? ఆం ... ఉంది. ఇంత అశాంతి లోనూ ఒకానొక ఆశారేఖ. నా లోని కవికి ఇన్‌స్పిరేషన్ ముక్క—రాధ. బృందా వనిలో ఒడి యమునా తీరం, శరచ్చంద్రి కల వెల వెన్నెలా, నీలాకాశం నుండి నేల మీదికి దిగుతున్న మెరుపు తీగ. అవును. ఆ సౌందర్యాన్ని ఒక పాటలోకి పిండుదా మంటే ఏదీ? టైమేదీ? ఎన్నో ఐడి యాలు వడియాల్లా వొత్తాలి, క్రొంగొ త్తవి. అవే. కళ్ళు. మా రాధ కళ్ళు. వచ్చింది. ఐడియా వచ్చేసింది. ( ఫైలు తీశాడు. వ్రాస్తున్నాడు. విరామం. చదువుకొంటూ లేచాడు. ) జాక్‌పాట్ టిక్కెట్టులా నీ కళ్ళు. బంపర్ క్యాష్ కోసం ఈ మనస్సును, కాదు నా మనస్సును ఊరిస్తున్నాయి.

రాజా : హారిబుల్, హారిబుల్, ఇది కవిత్వం కాదు. మీరు మామూలు కవులు గారు, మహాకవులు. మీ కవిత్వం ...

కాంతారావు : ( షాక్ తిన్నాడు. ) మీరు?

రాజా : కన్ఫ్యూజవకండి. ఇదే నా శ్రద్ధాంజలి.

కాంతారావు : ఏమ్, మిస్టర్! ఆ శబ్దానికి అర్థం తెలుసా?

రాజా : తప్పు. కాదు, సవరించుకొంటాను. పుష్పాం జలి. పురుడు పోసుకుంటున్న ఒకానొక మహా కవికి పురుటిలోనే ...

కాంతారావు : షటప్!

రాజా : శాంతించండి, కాంతారావుగారూ!

కాంతారావు : ఛ ఛ .. ఆ పేరు మార్చుకోవా లనుకొం టున్నాం. ( ఏదో గుర్తుకు వచ్చి ) అవును, నా పేరు మీ కెలా తెలుసు?

రాజా : మీ ఫైలు చెప్పింది. అంతేకాదు, ఇంకా బోలెడు తెలిశాయి. వినే ఓపికుందా?

కాంతారావు : ( రాజాను పరిశీలనగా చూచి రెండడు గులు వేసి ) ఇలా రండి!

రాజా : అలవాటు లేదు.

కాంతారావు : పిలవని పేరంటానికి వెళ్ళడం తమ కలవాటా? ( కొండలు వచ్చాడు. ) మీ రెవరు?

రాజా : చూస్తున్నారుగా?

కాంతారావు : మనిషే, సందేహం లేదు. కాని, ఎలాంటి మనిషీ అని.

కొండలు : చినబాబూ!

కాంతారావు : వచ్చావా, తండ్రీ! చూడండి. ఈ డొక్క పెద్ద ఐస్ ఫాక్టరీ. వీడి మొహంలో ఏముందో గాని చూస్తే చాలు—నరాల్లో రక్తం టక్కున ఆగిపోతుంది.

రాజా : మంచి మనిషేనే.

కాంతారావు : నిజమా, కలా? మంచి మనిషి ఇక్కడకు రావటమా? నేను నమ్మను. ( కొండ లుతో ) కొండలూ! వెళ్ళు. ఏం, తండ్రీ, ఎందుకలా చూస్తున్నావు. సి. ఐ. డీ. వన్నాసే. వెళ్ళు. వెళ్ళవతలకి. ( కోపంగా వెళ్ళాడు కొండలు. ) ఇప్పుడు చెప్పండి. నిజం మాట్లాడకండి — నాకు భయం. ఎందుకొచ్చారు? రహస్య మయితే నాతో చెప్పండి. మా మామయ్య అవురిస్తే పేపరెన్నో రెక్క వొప్పేస్తాడు.

రాజా : మీరు గింగిగోపులు. చెప్తుమంటారా? బాధ పడరుగా?

కాంతారావు : ఏం, అంతటి మాటా?

రాజా : మరేం లేదు. పక్కనున్న వారు బాధపడితే చూడలేని మనసు నాది. పరుల మనసు నొప్పిం చడం కూడా పాప మన్నారుగా? మనసంటే గుర్తొచ్చింది — ఈ కాలంలో అది ఎక్కడ దొరుకుతుందో మీ కేమన్నా తెలుసా?

కాంతారావు : మీరు జపం విడిచి ...

రాజా : ఏం చేయను? అలవాటయిపోయింది. గోరం తలు కొండంతలు చేసుకోవడం, గోటితో పోయేదాన్ని గొడ్డలితో నరకడం. అందుకే ఒక్కోసారి వచ్చి మళ్ళీ పుడదామా అనిపి స్తుంది. ( ఆగి ) అవును. నాకు గుర్తుంది. మూడేళ్ళ క్రితం నేను చచ్చిపోయాను.

కాంతారావు : ( ఆశ్చర్యం, కంగారు ) ఏమ్, ఆం. నువ్వు ... నువ్వు ...

రాజా : దెయ్యాన్నిమాత్రం కాను. మనసు చావని మనిషిని. మనసును చంపాలనుకొంటున్న మనిషిని.

కాంతారావు : మా మామయ్యను చంపుతావా? ఒరేయ్, కొం ...

రాజా : ( అరిచాడు. ) నోర్మూయ్! చంపడం చాలా సులభం. కాని, మీ దారి, నా దారి ఒక్కటే. మన మిద్దరం బాధపడుతున్నాం—మనసుల్ని చంపలేక, మనుషుల్ని చూడలేక. ఎందు కలా చూస్తున్నారు?

కాంతారావు : మీ రేమంటున్నారో ...

రాజా : అర్థంకాదు. అర్థమయితే బాధెందుకు? అర్థం కాదు కాబట్టే దీన్ని బాధ అంటున్నాను.

కాంతారావు : మీ రెక్కడినుండో తప్పించుకొచ్చారు.

రాజా : అది నాకు తెలుసు. ఆంధ్రదేశంలో ఒక్కచోట ఉంది మెంటల్ హాస్పిటల్. కాని, ఆ వాతా వరణాన్ని నాకన్నా మీరే ఎక్కువ లైక్ చేస్తారు.

కాంతారావు : ( షాక్ తిని ) నేను వ్రాసుకోవాలి.


రాజా : ఏమిటి? నా మాటలా? నేనేం రాజకీయ నాయకుణ్ణిగాదు, పేపరు కబుర్లాడడానికి.


కాంతారావు : ( అయోమయంగా చూశాడు. ఫైలు క్రింద పెట్టేశాడు. )

రాజా : అనవసరంగా వాగాను కదూ? ఇప్పుడు చెప్పండి— మీరు దేనికోసం బాధపడుతున్నారు?

కాంతారావు : ఏమో?

దేహపుష్టికి ఆరోగ్యానికి
కుండిత-డి గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మద్రాసు - 600017.

వాయిదాల మీద ట్రాన్సిస్టర్
నెలసరి రు. 5/- ల వాయిదాల మీద శక్తివంతమైన 3 బాండ్ల, అఖిల ప్రపంచ ట్రాన్సిస్టర్. ప్రతి బస్తీలోను, పల్లెలోను వాడవచ్చును. ఉచిత నిబంధనలకు కాంపిలుకు నేడే వ్రాయండి.

JEEP AGENCIES (WAP),
New Chanderawal,
DELHI-7.



లిచెన్‌సా
వాడండి

రాజా : దాచటానికి ప్రయత్నిస్తున్నారు. అయినా నేను చెప్పగలను. ఆఁ! మీరు చంపాలనుకొన్నా చంపలేక లోలోన మీరే బాధపడుతున్నారు.

కాంతారావు : అబద్ధం.

రాజా : అపార్థం చేసుకొన్నారు. అందుకే అట్లా అరిచారు. ఇక్కడ చంపలేకపోతున్నది మీ కోర్కెల్ని. పొరపాటున మీ మామయ్య నను కొన్నారు.

కాంతారావు : (కోపం వచ్చింది.) నువ్వు ఫూల్‌వి. మహా ఫూల్‌వి.

రాజా : కోప్పడకండి. మీరు రాధాదేవి ప్రణయంకోసం యమయాతన పడుతున్నారు, అవునా?

కాంతారావు : (నిజంగానే కోపమొచ్చింది.) మిస్టర్!

రాజా : ఏం, కొడతావా? కొంపలంటుకు పోలేదు లెండి. ప్రణయం క్రొత్త జబ్బేం కాదు. పదేళ్ళ కుర్రాడి మొదలు మూట పదిహారేళ్ళ ముసలాడి వరకూ ఈ జబ్బుతో ఏడుస్తున్నారు. కాని, ఒకటే చిక్కు. ప్రేమ చాలా ఖరీదయింది. డబ్బు కావాలన్నా, కాలక్షేపం కావాలన్నా, పేరు కావాలన్నా దీనితో కొనుక్కోవచ్చు. అయితే, పొదుపుగా వాడుకోవాలి. లేకుంటే ఒక్కొక్కప్పుడు పీపులూ, మరొకప్పుడు జీవితాలూ ఎగిరిపోతుంటాయి.

కాంతారావు : మీకు తెలియదా? అతి వాగుడు ఆరోగ్యానికి మంచిది కాదు.

రాజా : అమాయకుడివి, కాంతారావ్! మాట్లాడడం చేతకాని వాడు మన్నైపోతా డీ రోజుల్లో. మాటల్లో మైత్రి చూపడం, మంచిని మాటల్లో కురిపించడం నేర్చుకున్నావా సరి. లేదా ఈ మనుషులు అరచై అడుగుల గొయ్యి తవ్వి నిన్ను పాతేస్తారు. రాధను ప్రేమించిన మాట సత్యం. కాని, మాట్లాడడం చేతగాక, మాటల్లో మత్తు నింపడం రాక మాడిపోతున్నారు మీరు.

కాంతారావు : మీరు అనవసర విషయాల్లో ...

రాజా : లేకేం? కావలసినంత ఉంది. అందుకే ఈ గొడవంతా.

కాంతారావు : ఏమి టా అవసరం?

రాజా : నిజం చెప్పి మిమ్మ ల్నొడిపించడం ...

కాంతారావు : అపార్థంచుని కాను. చెప్పండి.

రాజా : గుడ్! హీరో అనుకుంటూ వచ్చాను. ఇక్కడి కొచ్చాక తెలిసింది. ఇక్కడ చాలామంది హీరో లున్నారని.

కాంతారావు : అంటే ... నేను ... నేను ...

రాజా : విలన్ అని నేను ఎలా అనగలను? పెళ్ళి చూపుల కొచ్చిన వాణ్ణి.

కాంతారావు : అబద్ధం కాదుగా? అయితే, మా మామ...

రాజా : ఏం చేస్తాం! అనుకోకుండా కలుసుకొన్నాం ఆ రాత్రి రైల్లో. నన్ను గురించి వివరాలు తెలుసుకొన్నాక అడ్రెసిచ్చి, అమ్మాయిని చూసి పొమ్మన్నారు. నాకేం తెలుసు — ఇక్కడో భావకవి, ఆ భామకు బావై బాధపడుతున్నాడని?

కాంతారావు : మోసం ... మోసం ...

రాజా : మోసం జరిగాక కాని, మనకు మోసమేదో తెలియదు. అదే తమాషా. బాధపడకండి.

## మేలు

**ఒకరికి మేలు చేసేవాడు తనకు తాను మేలు చేసుకున్నట్లే. ఆ మేలు ఫలితాన్ని బట్టి కాకుండా, చేస్తున్న మంచిలోనే మిళితమై ఉంటుంది. అసలు మంచి చేయాలనే సహృదయతే ఒక గొప్ప బహుమానం.**

—సెనెకా

కాంతారావు : ఎలా ఉండగలను? అన్నీ పోయాయి. మిగిలిన ఈ ఒక్క ఆశ — అది కూడా ఆరిపోయింది. ఆమె నెంతగా ఆరాధించాను! ఇది ఆమె తప్పుగాదు. ఇదంతా మామయ్య చేస్తున్న అన్యాయం.

రాజా : ప్రతి మనిషీ అనే మాటే ఇది. తాను కోరింది లభించనప్పుడు అన్యాయం అన్న పెద్దమాట విసరటం ప్రపంచానికి పెద్ద అలవాటు. నేను మూర్ఖుణ్ణి కాను. మీలో మంచితనముంది. మీకు సాయం చేస్తాను.

కాంతారావు : నమ్మమంటారా?

రాజా : నమ్మడం, నమ్మకపోవడం—రెండూ బలహీనతలే! అది మీ ఇష్టం. నాకు మీ దొక సాయం చేయాలి. ఇచ్చిపుచ్చుకోవడం—అంతే.

కాంతారావు : చెప్పండి.

రాజా : ఇప్పుడు కాదు. ముందు కొన్ని మంచినీళ్ళు కావాలి. (కొండల్ని పిలవబోయాడు కాంతారావు. చేత్తో ఆపాడు.) వద్దు. మీ చేతులతో తీర్థం ...

కాంతారావు : అలాగే. (వెళ్ళాడు.)

రాజా : ఉడతకు ఉరివేశాను. (చిన్నగా నవ్వుకొన్నాడు. గదిని పరీక్షగా చూశాడు. అతని దృష్టి లక్ష్మీపతి ఫోటోపై పడింది. క్రూరంగా చూస్తున్నాడు. ల ... క్ష్మీ ... ప... తి ... రాక్షసుడు కావచ్చు. నా లోనూ రాక్షసుడు మేల్కొన్నాడు. మనిషి గొంతు నొక్కుతున్నాడు. నొక్కాలి. చదువు లేదు. సంస్కారం లేదు. సమాధి చెయ్యవలసిందే. (ముఖం వికృతంగా మారింది. సిగరెట్ అంటించాడు. చుట్టూ పొగలు.) పగ, ఆరని పగ, పీక్కి మసిచేస్తాను. గుండెల్ని కాలుస్తున్న మంటను ఆర్పివేస్తాను. అడ్డొచ్చిన అందర్నీ ... (కాంతారావు వచ్చాడు.)

కాంతారావు : ఏమిటండోయ్, ఎవరడ్డొచ్చా రేమిటి? కొంపదీసి నేను కాదు గదా!

రాజా : పగ, పొగలా గుండెల్ని కప్పివేశాక నీ, నా అన్న తేడా ఎలా తెలుస్తుంది, రావ్! ప్రతీకారం అన్న అగ్నిపర్వతం పేలిపోయిన పగిలిననాడు ఈ గ్లాసెడు నీళ్ళు ఆర్పగలవా, నేస్తం? అయినా, తాగవలసిందే కదా!

కాంతారావు : ఏవో పెద్ద పెద్ద మాటలు విసురుతున్నారు. అన్నివిధాలా మోసపోయిన నాకు ఏం చేయాలో దిక్కు తెలియడంలేదు.

రాజా : అవసరమైనప్పుడు బుద్ధి తానంతట అదే పనిచేయడం నేర్చుకొంటుంది. పరిస్థితులు, వాతావరణం మీకు దారి చూపెడతాయి. ముందు మీరు కవిత్వం వ్రాయడం మానండి.

కాంతారావు : నాకున్న ఒక్కగా నొక్క రిక్రియేషన్ అది.

రాజా : రిక్రియేషన్ తాపత్రయం మాని జీవితాన్ని రియలైజ్ చేయడం నేర్చుకోండి. అన్నట్టు మీ కో విషయం తెలిసే ఉండవచ్చు. మీ మామగారు ఎవరితోనో కలిసి వ్యాపారం చేసే వారటగా?

కాంతారావు : (సందేహించాడు. అయినా) ఏమో, నాకా విషయాలు అర్థమయ్యేవి కావు.

రాజా : అమాయకుల కేమీ అర్థంకావు. అందుకే అన్యాయం మయిపోయారు. ఇదంతా చూస్తే మీ మామగారు ...

కాంతారావు : ఆవురించకనే పేగులు లెక్కపెట్టేస్తారు అనే గదా మీ అభిప్రాయం? నేను వెళ్ళి పిలుచుకువస్తాను.

రాజా : కానివ్వండి. (కాంతారావు బయటకు వెళ్ళాడు. రాజా గదిని చూస్తూ) ఇది హాలు. బయటి నుండి ఇలా వస్తే అది డైనింగ్ రూమ్. అది డ్రెస్సింగ్ రూమ్. ఇవి మేడ మెట్లు. హాల్లోనికి వచ్చిన వాడు మేడపైకి వెళ్ళాలంటే (ఇదంతా నటిస్తూ మాట్లాడుతుంటాడు. రాజా వెనకాలే దొంగలా వచ్చాడు కొండలు. గంట వాయించాడు. కంగారుగా తిరిగాడు రాజా. సకిలింపుగా నవ్వాడు కొండలు. విస్తుపోయి చూస్తున్నాడు రాజా.)

కొండలు : గంట కొట్టేశాను. ఎవ్వొక్కడివే ఎందుకిక్కడ? ఊపిరాడక చస్తావు. వెళ్ళిపో. ఆ రోజు గుళ్ళో ఇలాగే గంట కొట్టేశారు. నా గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి.

రాజా : కొండలూ!

కొండలు : పేరు కొండలే. కాని, కొండను ఢీకొనే గుండెలేని వాణ్ణి. కాలం కలిసిరాకపోతుందా? నేనూ నా కసి తీర్చుకొంటాను. వాణ్ణి, నిన్ను... అందర్నీ చీకట్లో ... ఆ గదిలో ... అరిచి చచ్చినట్లే ... అరిచి చచ్చినట్లే, (గణగణ గంట వాయించుకొంటూ వీధిలోకి పరుగెత్తాడు. రాజాకు అర్థంకాలేదు. మెల్లగా అడుగులు వేసుకొంటూ వీధి ద్వారం దగ్గరకు వెళ్ళి తిరిగొచ్చాడు.)

రాజా : నిజం నిద్రపోదు. ఏనాడో ఒక నాడు కాటు వేయక మానదు. అది ఈ రోజు జరిగితే .. జరిగితే? (దీర్ఘంగా ఆలోచిస్తూ నిలబడ్డాడు కార్నరుతో.)

(చెమటలు కక్కుకొంటూ కంగారుగా శ్రీపతి వచ్చాడు.)

శ్రీపతి : లచ్చింపతీ! ఒరేయ్, లచ్చింపతీ! ఇంకేముందిరా! నాకేదో భయంగా ఉందిరా. ఈ స్థానిక రాజకీయ దినపత్రికను చూశావా? నా ఎముకలు వణుకుతున్నాయిరా. (ఎదురుగా ఉన్న వాడిని గమనించకనే) ఆదెమ్మిట్టా, కోర్టులో రాష్ట్రపతి ఫోటోలా కదలవు, మెదలవు. ఇక్కడ నా గుండెలు ఆగిపోతుంటే? ఎవరూ లేరుగా? విసరా, విను. సెంట్రల్ సి. ఐ. డి. లు

పట్నంలో ఉన్నారట. వచ్చి వారం రోజులైందట. ఎక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో అంతుపట్టడం లేదు. కాబట్టి అప్పటిదాకా జాగ్రత్త! జాగ్రత్త! ఇంకేముందిరా, నా పంపా, నీ కొంపా హరిః ఓం తత్సత్!

రాజా : భక్తుడా! బహుకాలం నుండి భోజనంలేక రాణిస్కీస్ బాధపడుతోంది. ఈ వేళ పండుగ.

ప్రేమల : ఒరేయ్! నేను పాడిలి చస్తుంటే నీకు వేళాకోళమా? అయ్ నీ గొంతు, నీ గొంతు. (తిరిగి చూశాడు. బిత్తరపోయాడు. మోకాలు వణకుతున్నాయి.) సి ... ఏవ్వు! (ఎగిరిపడ్డాడు.) సి. ఐ. డి.! ఒరేయ్, తప్పించరా, ఎక్కడరా? నాకేం తెలియదు. అటంతా వాడికే తెలుసు. వాడికే తెలుసు. (అంటూ వీధిలోకి పరుగెత్తాడు.)

(రాజా నవ్వుకొన్నాడు. సూట్‌కేస్ దగ్గరికెళ్ళాడు. ఏదో తియ్యబోయాడు. రాధ వచ్చింది.)

రాజా : రండి, రండి. మీ కోసమే ఉన్నాను. ఎందుకో గాని మిమ్మల్ని చూస్తూ ఉంటే చాలా సరదాగా ఉంది. మీతో మాట్లాడుతూ ఇలా యుగాల్ని క్షణాల్లా గడిపెయ్యాలనే పాడు కోర్కె పుడుతోంది. తప్పనుకోండి. అయినా, ఫలించే టయిలేగా? ఏమంటారు?

రాధ : మర్యాద తెలియని మనుష్య లంటాను.

రాజా : కరెక్ట్. మర్యాదంటే నా కింతవరకూ తెలియదు. తెలుసుకోవాలనే ప్రయత్నం కూడా మానేశాను. ఎందుకో చెప్పమంటారా?

రాధ : మీ మాటలు వింటూ కూర్చునే ఓపిక, తీరికా నాకు లేవు.

రాజా : ఇప్పుడే ఇలా అంటున్నారు. ఇక జీవితాంతం వినవలసి వస్తే ఆత్మహత్య చేసుకోరుగదా?

రాధ : (ఆశ్చర్యంగా) ఏమిటి!

రాజా : ఎక్కడో పారవేసుకొన్న మీ హృదయం విన్నపోవటంతో విశేషం ఏమీ లేదు లెండి. ఇలాంటి కేసులంటేనే నా కిష్టం.

రాధ : ఏమిటి మీ రంటున్నది?

రాజా : ఎదుటివాడి హృదయాన్ని గాయపరచడం, వా డేడుస్తుంటే నాట్యం చెయ్యటం ...

రాధ : సరిగ్గా చెప్పండి.

రాజా : మిమ్మల్ని మరీ విసిగించడం మంచిది కాదు. అన్నట్టు మీ రీ పుస్తకం చదివారా? (పుస్తకం తీశాడు సూట్‌కేస్ నుండి.) 'ఫలించని ప్రణయ' మట. రచయిత ఎవరో గాని, ఏడుస్తూ వ్రాసినట్టుంది. కథ మామూలే. సినిమాలు చూసైనా వ్రాసి ఉండాలి; లేదా సినిమాల కోసమైనా వ్రాసి ఉండాలి. నేడు చాలామంది రచయితల వ్యాపారమే ఇది. రెండు మాటల్లో కథ చెప్పేస్తాను.

రాధ : (ఆలోచిస్తూ నిలబడింది.)

రాజా : అట్లా కూర్చోండి, ఫర్వాలేదు. అతడు హీరో అనుకొంటాను కథలో. మామకూతుర్ని పెర్మిషన్ తీసుకోకనే ప్రేమించేశాడు. కాని, ఆమె అంత తెలిగ్గా ఉందా, మామ కొడుకుపై మోజు పడటానికి? మరొకడి వలలో చిక్కిందామె. ఇక మజ్నూ—అంటే హీరో ఏమౌతాడు? (ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు. ఆమె కర్థం కాదు.) చస్తాడు. అంతే గదూ. . . ఏ ఆడది చెప్పదు. నేను చెబుతాను. అర్ధ ఔన్సు విషం తాగి ఊరుకొన్నాడు.

**ప్రభుత్వం**

ప్రభుత్వాన్ని గురించి ఎవరు పట్టించుకుంటారు — ప్రజలు సుఖంగా, దేశం శాంతిగా, సుసంపన్నంగా ఉంటే — ప్రభుత్వం పని సులభమవుతుంది.

—కాలింగ్

రాధ : రాజాగారూ!

రాజా : పేరు మరిచిపోయా రనుకున్నాను. గుర్తుంచుకొన్నందుకు థాంక్స్. ఆ రచయిత చేసిన వెధవ పని చెబితే మీరు నిజంగానే విస్తుపోతారు. అర్ధ ఔన్సు విషం తాగినా ఆ హీరో చావడు.

రాధ : నిజంగానా? !

రాజా : తెలుగువాడు కదండీ. ఎదుటివాడు ఏడుస్తుంటే చూడలేడు. అఫ్‌కోర్స్, సుఖపడుతున్నా చూడలేడనుకోండి. హాస్పిటల్లో బ్రతికించి అక్కడ హీరోయిన్ చేత హృదయ విదారకమైన మాటలు మాట్లాడించి, అసలైన హీరోను ఆశీర్వదించమని అటు ఆ అభాగ్యుడి చేత, ఇటు పాఠకుల చేత అక్షింతలు వేయించుకొని గ్రూప్‌ఫోటోకు రెడీ అయిపోతాయి తెలుగు పాత్రలు. లేదా డ్యూయెట్ కోసం బృందావన గార్డెన్‌కు పరుగులు తీస్తాయి.

రాధ : మీ రయితే ఏం చేసేవారు?

రాజా : మామ కొడుకు చేత అసలు హీరోను హత్య చేయించి ఉండేవాణ్ణి. ఆ అమ్మాయి మెడలో తాళి కట్టించి ఉండేవాడిని. నలుగురు పిల్లల్ని కన్న తరవాత ఆమె చేత విడాకు లిప్పించి ఉండేవాణ్ణి.

రాధ : ఆ తరవాత, మరో హత్య. . . కోర్టు. . . జైలు . . . అంతేగా?

రాజా : తెలుగు చాదస్తం ఒంట బట్టలేదు కాబట్టి మీ రేం జోక్ విసరనక్కర లేదు.

రాధ : ఆడవాళ్ళంటే మీ కెందు కంత కసి?

రాజా : కసి కాదు, అతి ప్రేమ. ప్రతి అందం వెనక ఒక కథ ఉంటుంది. అందుకే రోడ్డుమీద అందం కనిపిస్తే నాకనిపిస్తుంది—ఈ అందాన్ని ఎదురు వచ్చే లారీ ఎందుకు నలిపివేయదా? అని. అందం లారీ చక్రాల క్రింద నలిగిపోతుంటే చూడాలన్నది నా తీరని కోర్కె.

రాధ : ఛీ! మీ రెంత రాక్షసులు!

రాజా : ఇంత టైమ్ పట్టిందా నన్ను తెలుసుకోవడానికి. మిమ్మల్ని, మీ అందాన్ని చూస్తూ ఉంటే బూటుతో సిగరెట్టును నలిపినట్టు...

రాధ : (కంగారుగా) కొండలూ!

రాజా : నా కెందుకు మిధ్యలో? ఈ సౌందర్యం వెనక దాగిన విషం, ఎర్రటి ఈ చర్మం క్రింద దాగిన చీకటి రహస్యం, నా నరాల్లో ప్రవహించే ఎలక్ట్రిసిటీ ఇక్కడే. . . ఇప్పుడే. . . వినన్నా. . . మీ నాన్ననూ. . .

రాధ : (భయం). ఏమిటి మీ ఉద్దేశ్యం?

రాజా : ఎంత భయపడి పోయావు, రాధా! ఎంత పడుపు కొన్నా, రాజ్యాలేలినా ఆడది ఆడదే. . .

రాధ : ఆఁ!

రాజా : మీ ఆరోగ్యం ఎంత గట్టిదో చూడాలని నా ప్రయత్నం. చాలా చిత్రమయిం దీ లోకం. చీకట్లో ఏం జరిగినా ఊరుకుంటుంది. అసత్యాన్ని అమృతంలా జుర్రుతుంది. కాని, సత్యం చప్పినా, చీకటిని చీల్చినా, వెర్రిదానిలా అరుస్తుంది. పిచ్చిదానిలా గంతు లేస్తుంది. సత్యమంటే లోకానికి భయం కదూ?

రాధ : ఈ డొంక తిరుగుడు మాటలతో నన్ను పిచ్చిదాన్ని చేస్తున్నారు.

రాజా : అసలు విషయం చెబితే నిజంగానే పిచ్చి పడతుంది. రాత్రి. . . ఈ రాత్రే. . . ఒంటి గంటకు. . . ఇక్కడికే. . . సరాసరి అంతఃపురం లోకి. ఎంత ధైర్యం, రాధా! ఎంత అమాయకంగా ఉన్నావు! ఇది నిజం కాదు. నిజం కాదు. ఇది అపరంజి కాదు.

రాధ : మీ మాటలు నా కర్థం కావడం లేదు.

రాజా : నేను ఉత్తుంగోత్తుంగ స్వచ్ఛ గంగాతరంగ భంగి యశోవిరాజితను. అకళంకార్క కిరణసంజాతను. అనాఘ్రాత హృదయారవిందను. ధగధగాయ జ్వలిత జ్వాలానల మధ్య మందస్మిత చంద్రాననను. మత్ హృదంతరాన మృదు మధుర మంజుల వీణానిక్వణాల నింపు గాన విశారదను. ఝళం ఝళత్కటక సూచిత వేగ పాదాలంకృత నాట్యమయూరిని. నాలో ఆశల హరివిల్లులు సృష్టించి, కోరికల రంగవల్లికలు దిద్ది ఆనందోర్మికల నోల లాడించగల అందాల బొమ్మను. . .

రాధ : ఆగండి. ఏమిటి దీని కర్థం?

రాజా : మీకు తెలియదా? చాలా తెలివైన వారు. అందుకే ఈ నాటకం జరుగుతూంది. మీ నాన్నగారికి బయట నాటకాలాడ్డం తెలుసే గానీ, ఇంట్లో జరిగే నాటకం తెలిసినట్టు లేదు.

రాధ : తెలిసింది. ఈ కొండలు మా ఉప్పు తింటూనే కాగితం ... అదే ...

రాజా : కాదు. కామంతో కళ్ళు మూసుకుపోయి వయసు విసిరే కత్తులకు లొంగిపోయావు. పాలు ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తాయి. కాని, అవి విరిగి పోతే ...

రాధ : అంటే ... అంటే ... నేను ... నేను ... (కోపం వచ్చింది. ఆవేశంలో) నో ... నో ... మీరు ... యూ! ...

(అతని గొంతు నొక్కబోయింది. లక్ష్మీపతి, కాంతారావు, శ్రీపతి వచ్చారు. లక్ష్మీపతి ఈ దృశ్యం చూసి కంగారు పడ్డాడు.)

లక్ష్మీపతి : రాధా!

రాజా : అరవకండి. ఆడపిల్ల కిదే అందం. అయినా,

వే వెవరో ఆమెకు తెలుసంటారా?

(రాధ చూచింది. భయంగా ఇంట్లోకి వెళ్ళింది.)

లక్ష్మీపతి : మీకోసం చూశాను. మీరే ఆలస్యం చేశారు.

రాజా : ఏం చేయను! మనం రైలు ఎక్కగలమే గాని, దాన్ని టయానికి గమ్యం చేర్చలేం గదా?

శ్రీపతి : బాగా అన్నారు. ఈ రోజుల్లో రైళ్ళు అసలు చేరుకొంటాయన్న నమ్మకం కూడా లేదు.

కాంతారావు : నిజమే! దారిలో ఏదన్నా యాక్సిడెంట్?

శ్రీపతి : ( కంగారు ) ఆ! ఏమన్నావ్? యాక్సిడెంట్ ... యాక్సిడెంట్ ...

లక్ష్మీపతి : కాంతం! నీ కాళ్ళు కడుక్కో నీళ్ళియరా?

రాజా : ఈ యాక్సిడెంట్ ఏమిటండీ?

శ్రీపతి : మళ్ళీ యాక్సిడెంట్ ...

లక్ష్మీపతి : కాంతం ఎవ్వర్రా. కొండలు. ( వెళ్ళాడు ఇంట్లోకి. ) మరేం లేదు, శ్రీపతీ! ఎందుకా కంగారు? కొండలూ! కొండలూ! (వచ్చాడు. ) నీళ్ళు తీసుకురా!

శ్రీపతి : ప్రాణం పోతుంది. తొందరగా రా, తండ్రీ!

రాజా : లక్ష్మీపతిగారూ!

లక్ష్మీపతి : చెబుతాను. వీడు శ్రీపతని నా స్నేహితుడు. పెద్ద లాయరు.

రాజా : అంటే వకీలు. యాక్సిడెంట్ అంటే అదిరిపడే ఈ లాయరు ...

శ్రీపతి : అదిగో, మళ్ళీ యాక్సిడెంట్ ...

రాజా : సారీ! మీరు క్రిమినల్ లాయరు కాదన్న మాట?

లక్ష్మీపతి : తమాషా ఆడేసండి. వీడు ఈ జిల్లాలో పేరుమోసిన క్రిమినల్ లాయరు.

రాజా : యాక్సిడెంట్ అంటేనే అదిరిపడే ఈ లాయరు గారు మోసాలు, చావులు, హత్యలు...వీటిని ఎలా భరిస్తున్నారు?

శ్రీపతి : హత్య ... కాదు ... యాక్సిడెంట్ ... సెంట్రల్ సి. ఐ. డి. ... నాకేం తెలియదు. నేను కళ్ళు మూసుకున్నాను. అంతే ...

లక్ష్మీపతి : ( గర్జించాడు. ) శ్రీపతీ!

రాజా : లక్ష్మీపతిగారూ!

లక్ష్మీపతి : ( తడబడ్డాడు. ) మరేం లేదండీ. మా వాడి కష్టపడ్డప్పుడు మతి భ్రమిస్తుంది. ఒరేయ్, శ్రీపతీ! లేవరా! ఏదీ ఆ సత్యం? ఒక పట్టు పట్టు, అంతా పోతుంది.

రాజా : మీరు మీ అతిథిని మరిచిపోయారు.

లక్ష్మీపతి : ఎలా మరిచిపోతాను! రామాయణంలో పిడకల వేటలా వీ డొకడు. ఒరేయ్, కొండలూ! కాంతారావు! ఎక్కడ్రా?

( వచ్చారు. కొండలు నీళ్ళు తెచ్చాడు. ) ఇంటి కెవరయినా వస్తే ఇలాగేనా మర్యాద చేయడం? రాజాగారూ! మీ గది మేడమీద. కాస్త విశ్రాంతి తీసుకోండి. కొండలూ! సూట్‌కేస్ పైకి తీసుకుపో. కాంతం! అన్ని ఏర్పాట్లూ ఘనంగా ఉండాలి.

రాజా : నాకు తెలుసు. ఓ. కే. ( ముగ్గురూ మేడ మీదికి వెళ్ళారు. శ్రీపతి సత్యం పిల్చాడు. తేరుకొన్నాడు. )

శ్రీపతి : ఒరేయ్, లచ్చింపతీ!

లక్ష్మీపతి : నోర్మూయ్యరా. రాధా! రాధా! ( వచ్చింది. ) ఎవరనుకొన్నావు అతడు? నలుగురూ ఉన్నారని ఊరుకొన్నాను. బుద్ధుం డక్కర్లేదూ? ఇప్పు డతను ఏమను కొంటాడు? నా ప్లానంతా పాడుచేశా వమ్మా.

రాధ : క్షమించండి, నాన్నా!

లక్ష్మీపతి : నే నెన్ని ఆశలు పెట్టుకొన్నాను? రాజాగారు వస్తారు. నిన్ను చూస్తారు ...

రాధ : నాన్నా! ఆయన ... నన్ను ...

లక్ష్మీపతి : అప్పుడే కోప్పడుతు. నీ అదృష్టం ఎక్కడ పోతుందో. ఆ మాట ముందే వినిస్తే ...

రాధ : నాన్నా! ( సిగ్గుతో ఇంట్లోకి వెళ్ళింది. కొండలు దిగి వచ్చి ఇంట్లోకి వెళ్ళాడు. )

శ్రీపతి : ఒరేయ్, లచ్చింపతీ!

లక్ష్మీపతి : బుద్ధి లేదురా నీకు. దేనికయినా సమయం, సందర్భం ఉండాలి.

శ్రీపతి : చార్సౌ బీస్. సమయం, సందర్భం అంటే నాకు తెలుసుగాని, నా గుండెకేం తెలుసురా?

లక్ష్మీపతి : అందుకే దాన్ని ఆపరేట్ చేసి అవతల పారేయమంటాను.

శ్రీపతి : ఒరేయ్, తమాషా కంటున్నావా లేక నిజంగానే...

---

### శిక్ష

ప్రభుత్వ నిర్వహణలో భాగం తీసుకోని మేధావులకి శిక్ష ఒక్కటే— అయోగ్యుల పరిపాలనలో జీవించ వలసిరావడం.

—ప్లేటో

---

లక్ష్మీపతి : లేకపోతే, శుభం పలకరా అంటే — అత డెవ రనుకొన్నావు? కోటీశ్వరుడి కొడుకు. నా కూతుర్ని చూడడానికి వచ్చాడు.

శ్రీపతి : కోటీశ్వరుడే! ఎక్కడ పట్టావురా ఈ పులిని?

లక్ష్మీపతి : పులి కాదురా. పిచుక. బంగారు పిచుక. ఇది మన పంజరంలో బందీ కావాల్సిగాని...

శ్రీపతి : వల పన్నావా?

లక్ష్మీపతి : కాదు. సాలెపురుగులా గూడు అల్లాను.

శ్రీపతి : ఇంతవరకూ నాకు చెప్పలేదేం?

లక్ష్మీపతి : ఇది నా స్వవిషయం.

శ్రీపతి : నాకు వాటా లేదా?

లక్ష్మీపతి : ఏమన్నావు?

శ్రీపతి : నాకూ ఒక కూతురుంది. అందానికి, ఐశ్వర్యానికి లోటు లేదని నీకూ తెలుసు.

లక్ష్మీపతి : అంటే?

శ్రీపతి : అన్నిట్లో ఉన్నట్టు ఇందులోనూ నాకు వాటా కావాలి.

లక్ష్మీపతి : ఒరేయ్, శ్రీపతీ!

శ్రీపతి : అరుస్తా వెందుకు? నాలో బంగారం అంటే ఆశ కలిగించింది నువ్వు. ఆ ఆశ ఎంత దూరం వెళ్ళిందో నీకు తెలుసు. నా భార్యను పోగొట్టు కొన్నాను. నీవు చేసిన ప్రతి వెధవ పనిలో చేతులు కలిపాను. ఇదంతా దేనికోసం చేశాను? డబ్బు. అందుకే నాకు వాటా కావాలి.

లక్ష్మీపతి : న న్నింకా అర్థం చేసుకోలేదన్న మాట?

శ్రీపతి : నువ్వెక్కడనుండో ఊడిపడలేదు. నాలాంటి లాయరు పక్కన ఉన్నాడు కాబట్టి సరి పోయింది. లేకుంటే ఈసరికి కృష్ణ జన్మస్థానం ...

లక్ష్మీపతి : ( కొట్టేవాడిలా ముందుకొచ్చాడు. ) మాట పెగిలిందా!

శ్రీపతి : బెదిరిస్తావురా, లచ్చింపతీ! అన్నీ తెలిసి ఎందు కిలా ఎగిరి పడతావు? నీ బతుకు నా గుప్పెట్లో ... కాని ...

లక్ష్మీపతి : ఏమి టా కాని?

శ్రీపతి : ఈ బంగారు పిచుకను నాకు వదిలేయ్. కాంతానికి నీ కూతుర్నిచ్చి...రెండు పెళ్ళిళ్ళూ మహా వైభవంగా ...

లక్ష్మీపతి : శ్రీపతీ!

శ్రీపతి : కాంతం నీ చెల్లి కొడుకు. వాడి అమ్మా, నాన్నా చస్తే ఒక్క సంతకంతో వాణ్ణి నీ ఇంటి కుక్కను చేశావు. అందుకే మన పాపా లిలా ప్రక్షాళనం కానీయ్.

లక్ష్మీపతి : దెయ్యం వేదం వల్లిస్తున్నదే! శ్రీపతీ! ఈ జ్ఞానం ఆ నా డేమయింది?

శ్రీపతి : ఉంది. కాని, నీ పిశాచి బోనులో చిక్కి పోయాను. ప్రాణాల మీద తీపి, స్వార్థం.

లక్ష్మీపతి : ఆ ప్రాణం పోకుండా ఉండాలంటే నోరు మూసుకొని పడుండు. పిశాచాన్ని నిద్ర లేపకు.

శ్రీపతి : అప్పుడు. నిద్రలేస్తే ఆ పిశాచాని కాహారం కావాలి. నాకు తెలుసు—ఆ పిశాచం ఆకలికి ఎందరు బలై పోయారో. ఇరవై ఏళ్ళ క్రితం ... మొట్టమొదటి సారి మేల్కొన్నప్పుడు క్రూరంగా నలిగిపోయిన వాడు...

లక్ష్మీపతి : ఒరేయ్ ...,

శ్రీపతి : రెండో వేట. అన్నెం పున్నెం తెలియని అమాయకురాలు, కొండలు కూతురు ... బంగారం ...

లక్ష్మీపతి : శ్రీపతీ ...!

శ్రీపతి : ఇక మూడు ...

లక్ష్మీపతి : మాట్లాడావా — నువ్వూ వాళ్ళలో చేరి పోతావు.

శ్రీపతి : మనం మరిచిపోనట్టే పోలీసులు కూడా మరిచిపోలేదు. రాఘవయ్య చావు ...

లక్ష్మీపతి : యూ డామిట్. ( క్రూరంగా శ్రీపతి గొంతు పట్టుకొన్నాడు. మెట్ల మీద రాజా, కాంతారావు కనిపించారు. )

రాజా : మామగార్లిద్దరూ రిహార్సల్ వేస్తున్నట్టున్నారు. ( ఒక్క క్షణం ఇద్దరూ నిర్విణ్ణు లయ్యారు.)

లక్ష్మీపతి : ( సర్దుకొన్నాడు. ) మీరా? రండి. ఇది మాకు మామూలే.

శ్రీపతి : పెద్దమనుషులు కదండీ! మే మాడే నాటకాలు కొంచెం హై క్లాస్ గానే ఉంటాయిలెండి.

రాజా : వకీలయినా వజ్రంలాంటి మాటన్నారు. ఈ పెద్దమనుషులు, రాజకీయ నాయకులంటే నాకు చెప్పలేనంత ప్రేమ. మా ఇంట్లో టైగర్ ఉంది.

కాంతారావు : స్మగ్లరా?

లక్ష్మీపతి : కుక్కపేరయి ఉంటుంది.

రాజా : గుండెగలవారు మామగారు. వెంటనే పసిగట్టారు. స్మగ్లర్ను మేడల్లో ఉండవు. వాటి కాహారం అక్కడేం లభిస్తుంది?

శ్రీపతి : జూలో ఉంటాయి.

రాజా : బాగా అన్నారు!

కాంతారావు : మరి, కొండలు మీ మామగారు పులి అన్నాడే నాతో ...

రాజా : నిజమే. కాని, చిన్న సవరణ. మామగారు తినడంలోగాదు. సాహసంలో పులులు.

లక్ష్మీపతి : (నవ్వాలో, ఏడవాలో తెలియదు.) మీరు కాస్త విశ్రాంతి తీసుకొంటే మిగతా కార్యక్రమం ...

రాజా : లక్ష్మీపతిగారూ! మీ కభ్యంతరం లేకపోతే ఈ రాత్రికి ఇక్కడే ...

లక్ష్మీపతి : ఎంత మాట! మీ కేమయినా అర్జంటు పను లుంటాయేమోనని.

రాజా : ఇది జీవిత సమస్య. తీరిగ్గా పరిష్కరించుకోవడం మంచిదని.

శ్రీపతి : వెల్ సెడ్, మిలార్డ్!

కాంతారావు : కోర్టులో ఉన్నారా?

రాజా : కొంపలో ఉన్నా, కోర్టులో ఉన్నట్టు భావించే వకీళ్ళున్నారు కాబట్టే మన దేశంలో న్యాయం నాలుగు పాదాల మీద నడుస్తోంది.

కాంతారావు : కాని, శ్రీపతిగారి కున్నవి రెండు పాదాలే నండి.

శ్రీపతి : ఏరా, కాంతం, వేళాకోళమా?

రాజా : మీ మామగారిని కలిసితే నాలుగు కాళేజూ? కాస్త బుర్ర ఉపయోగించాలి, కాంతారావ్!

లక్ష్మీపతి : వాడి బుర్రెప్పుడు పనిచేసింది లెండి ఇప్పుడు పనిచెయ్యడానికి?

రాజా : కాలం. దేనికయినా కాలం కలిసిరావాలండి. నాతో పంపండి. నాలుగు నెలల్లో నలుగుర్ని మింగేలా తయారు చేస్తాను.

శ్రీపతి : అంతపని చేయకండి. మా లక్ష్మీపతి గోవిందా!

లక్ష్మీపతి : ఏమిట్రా గోవిందా?

కాంతారావు : మామయ్యా! మన కొండలు లేడూ — బంగారం వచ్చింది, మీ పని గోవిందా అంటున్నాడు. నాకేం అర్థం కాలేదు.

లక్ష్మీపతి : (షాక్) అంటాడురా! పింజారీ వెధవ. తిన్నింటి వాసాలు లెక్కించే రకం.

రాజా : అది చేయగలిగిం దీ దేశంలో ఇద్దరే, లక్ష్మీపతి గారూ!

శ్రీపతి : మేం కాదు కదా!

రాజా : బుజాలు తడుముకోకండి. ఒకడు రాజకీయ నాయకుడు; మరొకడు పెద్దమనిషి.

లక్ష్మీపతి : మీరు ...

రాజా : పైకి పోవాలంటారు. ప్రతివాడూ పైకి పోవాలనే వెధవ తాపత్రయం. పంపించేవా డుంటే నాకూ పోవాలనే ఉంది. పంపిస్తారనేగా వచ్చాను?

లక్ష్మీపతి : మీరు చిత్రంగా మాట్లాడతారు. నా ఉద్దేశం అదిగాదు.

రాజా : మీ ఉద్దేశం మంచిదే. ఆ కాంతారావ్! లాయర్ని చూశాం. ఇల్లు కూడా చూడాలని ఉంది.

లక్ష్మీపతి : శ్రీపతి ఇల్లు ఇక్కడికి చాలా దూరం.

రాజా : అక్కడే ఎక్కడ చిక్కిపోతానో అని మామగారి భయం. చిక్కను లెండి. చిక్కినా ఇక్కడికి చేరవలసిందేగా?

శ్రీపతి : భలేవారండి.

కాంతారావు : ఇంకేం, సార్! పెద్దమనుషు లిద్దరు సర్టిఫై చేశారు. ఇక నడవండి.

రాజా : శ్రీపతిగారు కూడా మనతో నడుస్తారా లేక ఇంకా తేల్చుకోవలసినవి ఏమన్నా ఉన్నాయా?

లక్ష్మీపతి : ఏముంటాయి లెండి? వెళ్ళు, శ్రీపతి!

శ్రీపతి : నేను వెళ్ళను. (కూర్చున్నాడు.)

లక్ష్మీపతి : వెళ్ళవయ్యా పెద్దమనిషి పిలుస్తుంటే.

రాజా : అంత యోగ్యత నే నింకా సంపాదించుకోలేదు లెండి. డబ్బు సంపాదించానా, మేడలు, కార్లు కొన్నానా? ఖూనీ గట్రా ఏమైనా చేశానా మీ లిస్టులో చేరడానికి? అన్నట్టు రాఘవయ్య గారని ఈ ఊళ్ళో ...

## పాలనార్హత

పదవులకు, పరిపాలనకు పరుగులెత్తే వారు పాటించవలసిన సూత్రాలు: ముందు తనను తాను పాలించుకోగలగాలి, రెండు ఇంటిని పాలించాలి. తనను, తన ఇంటిని చక్కదిద్దుకోలేని వాడు దేశాన్ని పాలించలేడు. ఇతరుల్ని శాసించలేడు.

—ర్యాలి

శ్రీపతి : (అదిరిపోయాడు.) మీ ... మీ ... మీకు తెలుసా?

లక్ష్మీపతి : (షాక్) రాఘవయ్య!

రాజా : ఈ మట్టి మనుషులు మహా మేధావులు. నీతులు వల్లిస్తూనే గోతులు తవ్వుతారు. నమ్మించి అమాంతం గొంతు నొక్కేస్తారు. (లక్ష్మీపతి, శ్రీపతి గుండెల్లో పిడుగుల వర్షం. చెమటలు పడుతున్నాయి.)

శ్రీపతి, లక్ష్మీపతి : (ఒక్కసారే) మీరు... మీరు...

రాజా : మీ కెందుకండి భయం? చెమట తుడుచు కోండి. రైల్లో వస్తున్నాను గదండి? రక రకాల మనుషులు, రకరకాల మాటలు. ఏం చేద్దాం—చెవులు మూసుకోలేం గదా!

కాంతారావు : పొడకెత్తించడంలో మీ తరవాతే మరొకరు.

రాజా : థ్రిల్. థ్రిల్ లేకపోతే ఎలాగండి మరి? అన్నను. (తిన్నట్టు చూచుకొన్నాడు వాచీ లేదు.) మనం మళ్ళీ ఒకసారి పైకి వెళ్ళాలి. మరీ పైకి కాదు లెండి. లక్ష్మీపతిగారూ! నిశ్చింతగా మీ కార్యక్రమం సాగించవచ్చు.

(కాంతారావు, రాజా మేడపైకి వెళ్ళారు.)

(శ్రీపతి ఆలోచిస్తూ కూర్చున్నాడు. రాజా మాటలు లక్ష్మీపతి గుండెల్ని కోశాయి. అత నిలో ఉన్న ఉక్రోషం కట్టలు తెంచుకొంది. ఎదురుగా ఉన్న శ్రీపతివైపు విరుచుకుపడ్డాడు.)

లక్ష్మీపతి : ఛీ. ఛీ ముండు, కృతఘ్నుడా!

శ్రీపతి : ఆ మాట కర్థం తెలియదు నీకు. తెలిసి ఉంటే న న్నసలు అనలేవు.

లక్ష్మీపతి : నాకే గొయ్యి తవ్వాలని చూస్తావా?

శ్రీపతి : (లేస్తూ) నేను కాదు, నువ్వే తవ్వుకొన్నావు. ఈ రాజా వాలకం చూస్తే నిన్ను గోతిలో తోసేవాడిలా ఉన్నాడు.

లక్ష్మీపతి : నువ్వుమాత్రం తప్పించుకో గలవా?

శ్రీపతి : గలను.

లక్ష్మీపతి : అది నీ భ్రమ.

శ్రీపతి : నేను 'లా' చదివాను. నాకు 'లా' తెలుసు.

లక్ష్మీపతి : బెదిరిపోను.

శ్రీపతి : బెదరడం కాదు. కళ్ళు తెరవమంటు న్నాను. సెంట్రల్ సి. ఐ. డి. లు వచ్చారన్న సంగతి మరిచిపోయావా? రాజాలో ఏదో రహస్య ముంది. మనల్ని తినే పులిలా ఉన్నాడు.

లక్ష్మీపతి : పులి. అయితే, భయం లేదు. పులి నోట్లో అందిస్తే చాలు, హాయిగా నిద్రపోతుంది.

శ్రీపతి : నిద్రపోతున్నది నువ్వు. వాడు కాదు.

లక్ష్మీపతి : నువ్వు మేల్కొన్నావా?

శ్రీపతి : నాలుగు నెలలయింది. నాలో ఏదో కలవరం. చేసిన పాపాలన్నీ పాముల్లా గుండెల్ని కాటే స్తున్నాయి.

లక్ష్మీపతి : పిరికితనం నేర్పిస్తున్నావా?

శ్రీపతి : లేదు, లచ్చింపతీ! ఈ అంతరాత్మ చేసే చిత్ర వధ భరించలేకుండా ఉన్నాను.

లక్ష్మీపతి : అంతరాత్మ ... అంతరాత్మ ... ఎక్క డుంది నీ అంతరాత్మ?

శ్రీపతి : నీ అంతరాంతరాళాలలో ఉంది. నీ గుండెల లోతుల్లో ...

లక్ష్మీపతి : లేదు, లేదు. అది ఉండడానికి వీల్లేదు.

శ్రీపతి : బంగారం చావులో ఉంది.

లక్ష్మీపతి : (షాక్ తిన్నాడు.) శ్రీ ... ప ... తీ!

శ్రీపతి : నా భార్య రత్న. నీ వలలో చిక్కి సంక్షోభం భరించలేక తాగిన ఎండ్రిన్‌లో ఉంది.

లక్ష్మీపతి : అబద్ధం. అబద్ధం.

శ్రీపతి : అంతకంటే నిజం. నీ దగ్గర కానీ లేకపోయినా, నీకు వాటా ఇచ్చి నిన్నొక మనిషిగా నిల బెట్టిన రాఘవయ్య గొంతు నొక్కిన నీ అరచేతుల్లో ఉంది.

లక్ష్మీపతి : శ్రీపతీ! నీ నోరు ...

శ్రీపతి : ఎన్నాళ్ళు మూస్తావు? నిజం గ్రహించు. రాఘవయ్య చావు, రాజా రహస్యం. రాజా రాఘవయ్య కొడుకు ఎందుకు కాకూడదు?

లక్ష్మీపతి : ట్రాష్. నేను నమ్మను. రాఘవయ్య... రాజా ... లేదు. అంతా కాలిపోయారు. అంతా బూడిదైపోయారు.

శ్రీపతి : అల్లావుద్దీనుకు మిగిలింది కూడా బూడిదే. ఆలోచించు. (చరచరా వెళ్ళిపోయాడు.)

లక్ష్మీపతి : (దిక్కుతెలియని స్థితి.) బూడిద ... అల్లావుద్దీన్ ... ఆశ ... బూడిద ... (ఘల్లుఘల్లుమని కాలి మువ్వల శబ్దం వినిపించింది.)



పంజరం

చిత్రం— లావణ్య (శ్రీశైలం)

లక్ష్మీపతి : ఈ మువ్వల మోత ... ఈ మోత ... ఎక్కడో విన్నాను. ఎప్పుడో ... ఆఁ బంగారం ... కొండలు కూతురు ...

బంగారం : (నేపథ్యం నుండి వినిపిస్తుంది.) బాబు గారూ! బాబుగారూ! మీకు చేతులెత్తి దండం పెడతాను. నన్ను వదలండి. నన్ను వదలండి. ఇది మీకు తగదు. నేను మీ రాధమ్మలాంటి దాన్ని. నేను మీ రాధమ్మను.

లక్ష్మీపతి : బంగారం! పూజారిలా పూజించేవాణ్ణి గదా. ఎందుకు ఉరిపోసుకున్నావు?

(కిలకిల నవ్వులు వినిపించాయి.)

లక్ష్మీపతి : అదే నవ్వు. అదే నవ్వు. పదేళ్ళ క్రితం. చివరిసారిగా కూడా నవ్వింది. నవ్వింది. రత్నా!

రత్న : (మాటలుమాత్రం వినిపించాయి.) ఈ సంకెళ్ళింక తెంచేయండి, లక్ష్మీపతిగారూ! నే నీ ఆత్మ క్షోభ భరించలేను. భర్తకు ద్రోహం చేస్తూ భార్యగా బ్రతకలేకుండా ఉన్నాను. మీరు పరిచిపోకపోతే నా కాత్మహత్యే శరణ్యం.

లక్ష్మీపతి : రత్నా! నీ భర్తను మనిషిని చేశాను. డబ్బు, అధికారం, హోదా అన్నీ ఇప్పించాను. నువ్వు మోసం చేశావు. నువ్వు మోసం చేశావు. (టక్కు టక్కుమంటూ బూట్ల శబ్దం వినిపించింది. ఏదో ఒక నీడ చిన్నదిగా కనిపించి ఎత్తుగా పెరిగింది. లక్ష్మీపతి వైపు రాసాగింది. అతడు గడగడ వణికిపోయాడు.)

లక్ష్మీపతి : నువ్వే నా అంతరాత్మ. (నీడ ఇంకా ముందుకు వస్తున్నది.) ఎవరు నువ్వు? మాట్లాడవేం? అ క్కడే. ముందు కొచ్చావా చస్తావు. రాఘవయ్య ... మరో సారి నా చేతులు ... చేతులు ... నీ గొంతు నొక్కేస్తాయి. (నీడ వస్తూనే ఉంది. అతడు వణికిపోతున్నాడు. అతనిలో ఆవేశం, భయం కట్టలు తెంచుకున్నాయి. ఉరుములా అరిచాడు.) రాఘవయ్యా! నిన్ను ... నిన్ను ... (రంగం చీకటిలో మునిగింది. కీచుమంటూ ఒక వికృత శబ్దం భవనం నిండా నిండింది. ఒక నిమిషం లైట్లు వెలిగాయి. మేడ మెట్లపై రాజా, కాంతారావు. ఉన్మాదు డయిన లక్ష్మీపతి చేతుల్లో నుండి నిర్జీవంగా జారిపోతున్న రాధను ఒక్క ఉరుకులో వచ్చి కాంతారావు పట్టు కొన్నాడు. కొండలు గంట వాయించు కొంటూ — "బంగారం. లక్ష్మీపతీ! నా కూతురు బంగారం" అని వికారంగా నవ్వుకొంటూ వీధిలోకి పరుగెత్తాడు. "రాధా! రాధా!" అంటూ బావురు మన్నాడు కాంతారావు. "నిజం కాలేసింది, నిజం కాలేసింది" అంటూ నవ్వుతున్నాడు రాజా. శిలలా నిలబడ్డ లక్ష్మీపతి ఎలుగెత్తి భయంకరంగా నవ్వే శాడు ఇలా అనుకొంటూ — "నిజం కాలేస్తుంది. నిజం కాలేసింది." ★

(తెర)